

# అమాయకపు ప్రేమ

## I

సాయంకాలం ఆరుగంటల సమయం. ఆకాశమంతయు మేఘావృతమై మెరుపులతోడను, ఉరుములతోడను నిండి యున్నది. వర్షము ఒక మాదిరిగా కురుస్తోంది. ఒక ఒంటెద్దు బండిలో నలుగురు స్త్రీలు సారంగధరుని మెట్ట చూచుటకు వెళ్లి తిరిగి యింటికి బోవుచున్నారు. కొందరు చిత్రకారులు ప్రకృతి దృశ్యములను వ్రాసి కొనుటకు వెళ్లి అది ముగించుకొని యిండ్లకు మరలుచున్నారు. అందు పన్నెండేండ్ల కుఱ్ఱవాడొకడున్నాడు. ఆ కుఱ్ఱవాడు చక్కని దేహచ్ఛాయ, లక్షణమైన ముఖము, లేత వయస్సుతో ముద్దులొలుకుచుండెను. వర్షములో తడుస్తూ, వారు తమ బండి వెనుక కొంచెం దూరంలో వస్తూ ఉండడం ఈ స్త్రీలు చూచారు. ఆ కుఱ్ఱవాడు వీరందరి దృష్టులను ఆకర్షించాడు. అతను వర్షంలోతడుస్తూ అలా నడచిరావడమును వారు సహించలేక పోయారు. బండి నాపి అందొకామె "అబ్బాయీ! వర్షంలో తడుస్తూ అలా నడచి మీ యింటికి వెళ్లడంకష్టం. మా బండిలో యెక్కు నిన్ను మా యింటికి తీసికొని వెళ్లి అక్కడి నుండి మీ యింటికిపంపిస్తా" అన్నది. ఆ పిల్లవాడు చాలా సిగ్గుపడ్డాడు. తన గురువువైపు చూచాడు. ఆయన నవ్వుతూ వెళ్లు పరవాలేదన్నారు. ఆ అబ్బాయి బండియెక్కి సిగ్గుచేత తలవంచుకొని కూర్చున్నాడు. బండిలోని స్త్రీలు ఆ అబ్బాయి యెవరబ్బాయో, ఏయూరో, ఏమి చదువుతున్నాడో మొదలగు కొన్ని ప్రశ్నలు వేశారు. అతను సిగ్గుపడుతూ వారికి సమాధాన మిచ్చాడు.

చిత్రకళామందిరం. అందు చిత్రకళను నేర్పు పాఠశాల. కొంతమంది బాలురు, బాలికలు కూర్చుని చిత్తరువులను వ్రాయుచున్నారు. గురువుగారు తన ప్రియశిష్యుడైన, పైన చెప్పబడిన అబ్బాయిని వెంటబెట్టుకొని వచ్చారు. పాపమా అబ్బాయి కింతవరకు ఆడపిల్లలు, మగపిల్లలు కలసిమెలసి యుంటారనీ, ఆడపిల్లలుకూడా చిత్తరువులను వ్రాయ సమర్థత కలిగియుంటారనీ తెలియదు. ఈ పాఠశాలలోనికి వచ్చి యీ విద్యార్థులను చూడగానే అతనికి ఒకవిధమైన ఆశ్చర్యం కలిగింది. గురువుగారి ప్రోత్సాహంవలన తానుకూడా అక్కడ కూర్చుండి బొమ్మ వ్రాయడం ప్రారంభించాడు. బొమ్మ పూర్తి అయింది. చిత్తరువులను వ్రాయుటలో మంచి ప్రావీణ్యత కలిగి ఇంచుమించు గురువుతో సమానముగా చిత్తరువులను వ్రాయుచున్న యొక ప్రియ శిష్యురాలిని చూపి ఆమె యొద్దకు వెళ్లి బొమ్మను దిద్దించుకొనమని గురువు ఆ అబ్బాయికి చెప్పారు. అతనికి చాలా నామోషీ అనిపించింది, ఆడపిల్లచేత దిద్దించుకోటమా అని. కొంతసేపు సందేహిం

చూడు. గురువుగారు కనిపెట్టారు. "ఏమిటి ఆలోచిస్తున్నావు? వేళ్లు పరవాలేదు దిద్దించుకో" అన్నారు. ఏం చేస్తాడు? వెళ్లాడు. ఆమె అతనిని తన తమ్ముని వలె యాదరించి దగ్గర కూర్చుండ బెట్టుకొని తప్పులను చెప్పుచు దిద్దింది. ఆమె యాదరణ, సరియైన తప్పులను చక్కగా కనిపెట్టి చెప్పుచు దిద్దుట, బొమ్మలను వ్రాయుటలోనే గాకుండా యితరులకు బోధించి చెప్పుటలోగల యామె నేర్పు అతనిని ముగ్ధుణ్ణి చేశాయి. స్త్రీ యనే నిరసన భావము, అసహనము పోయి ఆమె యందొక విధమైన భక్తి గౌరవము లేర్పడ్డాయి. తన కక్కసెల్లెండ్రు లేకపోవుటచేత ఆమెనే తన సోదరిగా భావించుకొన్నాడు. చనువేర్పడింది. ఆ పాఠశాల, పాఠశాలగల ఆ గృహము, ఆ చిత్రకారిణి అతనిని ఆకర్షించాయి ప్రతి దినము తప్పకుండా వెళ్లి చిత్తరువులను అతి శ్రద్ధగా వ్రాస్తో ఉన్నాడు. అతను వ్రాసే చిత్తరువులుకూడా స్వాభావికముగను, చక్కగను ఉంటున్నాయి.

## II

ఒక ఆదివారమునాడు ఈ చిత్రకారులంతా ప్రకృతి దృశ్యములను వ్రాసికొనుటకు విహారమునకు బయలు వెడలు చుండిరి. బొమ్మలతోబాటు ఒక బొమ్మవలెనే యున్న పదేళ్ల అమ్మాయి లోపలినుండి పరుగెత్తుకొని వచ్చి మీతో నేనూ వస్తానంది. నీవు కూడా మా పాఠశాలలో జేరి బొమ్మలు వ్రాస్తాంటేనే తీసికొని వెడతాము కాని లేకపోతే తీసికొని వెళ్లమన్నారు గురువుగారు. ఇకనుండి నేనూ నేర్చుకొంటానంది. అంత కలసి స్కెచింగ్‌కి (సంక్షిప్త వ్రాత) వెళ్లారు. ఆ విద్యార్థులందరిలోకీమరీ చిన్నవాళ్లు ఆ అబ్బాయీ, ఈ అమ్మాయే. తక్కిన వాళ్లంతా కొంచెం పెద్దవాళ్లే. అందరూ తలయొక చోట కూర్చుని దృశ్యములను వ్రాస్తున్నారు ఇంచుమించు తన యీడుదే అయిన లీలను చూచుటకు సిగ్గుచేత, ఆమెవైపు చూడలేదు శ్యామ ప్రసాదు. ఇప్పుడామె బొమ్మ వ్రాస్తోంటే ఆడపిల్ల, ఇంత చిన్నపిల్ల కూడా బొమ్మ వ్రాయడమేనా అని అతనికి ఆశ్చర్యం. ఆమె యెలా వ్రాస్తోందో చూడాలని ఆతురతగా ఉంది. ఎలా చూస్తాడు? ఆమె వద్దకు వెళ్లడానికి సిగ్గు. ఒకవేళ తాను సిగ్గు వదలి యెలాగో ధైర్యం తెచ్చుకొని వెడితే తక్కిన వాళ్లంతా నవ్వుతారేమో అని భయం

"అంతా బొమ్మలు వ్రాయడం చాలించండి. సాయంకాలమవుతోంది యికబయలుదేరాలి" అన్నారు గురువుగారు అంతా వ్రాయడం మానేశారు. గురువుగారు ఒక్కొక్కరి బొమ్మ నేతీసికొని విమర్శిస్తున్నారు. పాపం! శ్యామునకు లీల బొమ్మను చూచే ఛాన్సు దొరికింది. పిల్ల ఆడపిల్లైనా బొమ్మ చక్కగా వ్రాసిందే! ఏమిటీ ఆశ్చర్యం అనుకున్నాడు తన మనస్సులో. బొమ్మను చూచాక ఆ అమ్మాయికేసి తిరిగాయి కళ్లు తనకు తెలియకుండానే. మొగలిపొత్తివంటి చక్కని శరీరచ్ఛాయ, విశాలమై సోగలు తేరియున్న కళ్లు, సంపెంగ పూవునకు వంకలెంచు ముక్కు, తీర్చి దిద్దినట్లున్న కనుబొమలు, చంద్రబింబమును సిగ్గు పరచు ఆమె చక్కని ముఖము అతనికి తెలియకుండగనే అతని హృదయాన్ని తమ వైపునకు లాగుకొన్నాయి, అయస్కాంతము ఇనుమును లాగుకొన్నట్లు. అంతా బయలుదేరి యెవరి యిండ్లకు వాళ్లు వెళ్లిపోయారు. లీల కూడా పాఠశాలలో చేరింది. శ్రద్ధగా బొమ్మలు వ్రాస్తోంది. లీలను మించాలని శ్యాము, శ్యామును మించాలని లీలా పోటీలమీద బొమ్మలు వ్రాస్తున్నారు. శ్యామప్రసాదుకు బొమ్మ వ్రాయడం అయిపోయినా వారియిల్లు విడిచిపెట్టి వెళ్లడం ఇష్టంలేదు. తాను తన స్త్రీ యుపాధ్యాయినితోను, ఆమె సోదరి, తన తోడి విద్యార్థిని, తన హృదయము నపహరించిన దొంగ, లీలతోను కబుర్లు చెప్పుతూనో, కారమ్సు ఆడుతూనో, షికారు వెడుతూనో బాగా చీకటి పడేవరకు ఉండి అప్పుడు వెళ్లేవాడు. వీళ్ళిద్దఱూ కూర్చుని బొమ్మలు వ్రాస్తూ ఉంటే చూసిన వాళ్లంతా అబ్బా! ఈ యిద్దర్నీ భగవంతుడు ఒక మాదిరిగానే సృష్టించాడు. వీళ్లిద్దరికీ పెళ్లిచేస్తే యెంత బాగుంటుందీ! అంటూ ఉండేవారు.

## III

లీల స్కూలుఫైనలు పరీక్షలో కృతార్థురాలైంది. ఆమె తల్లీ, అక్కగార్లు, అన్నగార్లకు ఆమెను బి. ఎ. వరకూ చదివించాలనీ, బి ఎ. పరీక్ష అయేవరకూ పెండ్లిమాట తలపెట్ట కూడదనీ ఉంది. లీల కాకినాడ పి. ఆర్. కాలేజిలో

ఇంటర్మీడియెట్‌లో చేరింది. శ్యామప్రసాదరావు ఇంటర్‌లో కృతార్థుడై కాశీ విశ్వ విద్యాలయంలో ఇంజనీరింగులో చేరాలని వెళ్ళి, ఆ తరగతిలో సీటు లేక పోవుటచేత బి. యస్. సి లో చేరాడు. వీరిరువురకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. వాటివలన వీరికి బాల్యంలో యేర్పడ్డ ఆ అమాయకపుప్రేమ, స్నేహము వయసుతోబాటు పెరిగి గాఢమైన అనురాగము క్రింద మారినట్లు స్పష్టమయింది. లీల చేరింది, మగపిల్లల కాలేజీ. ఆమె బాల్యములోని అందమే యొక పిల్లవానిని గాఢముగా నాకర్షించింది. ఇప్పుడు నవయౌవ్వనములో నున్నది. ఇక్కడి మగ పిల్లలనందటి నాకర్షించుటలో నాశ్చర్యమేముందీ? అర్హులుకాని వారందఱూ పైకేమీ తెలియ పరచక లోలోన నువ్విళులూరుచుండిరి. ఉన్నత కుటుంబములలోని వారు, తమ కర్హతయున్నదని తలంచిన వారు ఉత్తరముల మూలమున, పద్యముల ద్వారా, కవిత్వ ధోరణిలో తమకు ఆమె యందు గల యనురాగమును వెల్లడించు కొనుచుండిరి. వానిని ఆమె చూచుకొని లోలోన నవ్వుకొనుచు చింపి పార వేయుచున్నదేగాని ప్రిన్స్‌పాల్‌తో రిపోర్టు చేయడంలేదు పాపం వారిని శిక్షిస్తారేమోనని. ఇంతకు చేయవలసిన యగత్యమేముందీ? వాళ్లు తమ కోరికలను మర్యాదగా, గౌరవంగా తెలియ పరచు కొంటున్నారేగాని తననేమీ బాధించుట లేదుకదా. అవమానించుట లేదు కదా. ఈ సంగతి యితరుల వలన తెలిసికొనిన ప్రిన్సుపాలుగారు ఈమె విషయంలో తప్పభిప్రాయం పడుట వలన ఆయన కోపమునకామె పాత్రురాలగుచుండెను. ఈమె కిక్కడ విద్యాభ్యాసము చాలా కష్టముగా నుండెను. మనస్సునకు శాంతి లేక పోవుటచే శరీరారోగ్యముకూడా చెడుచుండెను.

బి. ఎస్. సి. పరీక్షలు సమీపిస్తున్నాయి. శ్యామప్రసాదు అతి దీక్షగా చదువుతున్నాడు. పోష్టుబంట్రోతు ఒక యుత్తరము తీసికొని వచ్చి యిచ్చాడు అది తన తల్లి పినతండ్రియైన భుజంగరావుగారి యొద్దనుండి అందులో తన మనుమరాలైన జానకికి ఈ మాఘమాసములో పెండ్లి చేయాలని అనుకొంటున్నామనియు, ఆమెను మొదటినుండి నీకే ఈయదలచి యుండుటచేత నీకు తప్ప మరియొకరి కీయమనియు, నీకు వచ్చుట కెప్పుడు వీలో తెలియజేస్తే దానిని పట్టి ముహూర్త నిశ్చయము చేసెద మనియు, ఒకవేళ నీకిక్కడకు వచ్చుటకు వీలులేని యెడల అక్కడకే వచ్చి వివాహము చేసెదమనియు నున్నది. ఆ యుత్తరము చూడగానే అతనిమీద పిడుగు పడినట్లయింది. ఏమి చేయుటకును, ఏమి వ్రాయుటకును తోచుటలేదు. ఈ విధముగా ఆయన దినమువిడిచి దినము ఉత్తరాలు కురిపించేస్తున్నారు. తాను మరియొక అమ్మాయిని ప్రేమిస్తోన్నట్లు తన తల్లిదండ్రులకు, బంధుగులకు తెలియును. కాని అది అసంభవమనియు, వారా అమ్మాయిని బి ఏ. పరీక్ష ఆయాక ఏ ఐ సి. ఎస్. అఫీసరుకో ఇచ్చి వివాహము చేయ దలచియున్నారనియు, వీడు వెఱ్ఱి భ్రమ పడుతున్నాడనియు వారికి తెలియును. అందువలన ఎంత త్వరలో పెండ్లి చేస్తే అంత మంచిదని వారి తలంపు. నేను పరీక్షలయాక అక్కడకు వస్తాను, అప్పుడాలోచించవచ్చునని వ్రాశాడు శ్యాము.

పరీక్షలయాయి. శ్యామప్రసాదు వాళ్ల యూరు వెళ్లాడు. తలిదండ్రులు పెండ్లిమాట చెప్పారు. నేనా అమ్మాయిని చేసికోనని ధైర్యం తెచ్చుకొని చెప్పాడు శ్యామప్రసాదు. తల్లికి చాలా కష్టమనిపించింది చిన్నప్పటినుండి అనుకుంటున్న సంబంధం. వాళ్ల కొక్కర్తే పిల్ల; మంచి ఆస్తిపరులు; ఆ ఆస్తికంతకూ ఇతనే ఉత్తరాధికారి, వాళ్లెంతో ఆశ పెట్టుకొని యున్నారు. కాని, యేమయినాసరే చేసికోనన్నాడు. పోనీ ఆ పిల్లకాకపోతే మరియొక పిల్లను చేసికో. ఈ వేసవి సెలవులలో నీకు పెండ్లిచేయక తప్పదన్నారు. తాను మరియొక పిల్లను ప్రేమిస్తోన్నట్లు తన నోటితో తాను చెప్ప సాహసించ లేకున్నాడు శ్యామప్రసాదు.

మంచి ఆస్తిపరులు, వారికి ఒక్కర్తే పిల్ల. పిల్ల రూపసి కాదు కాని కురూపి మాత్రం కాదు. చదువుకోలేదు. వారు పిల్లనిస్తామని వచ్చారు. తలి దండ్రులు నిశ్చయం చేసికొన్నారు. ఎల్లుండివచ్చి తాంబూలా లిస్తామన్నారువారు. శ్యామప్రసాదరావు ఎక్కడికో వెళ్లివచ్చాడు. పెండ్లినిశ్చయమయినదనియు, ఈ దినమే వారు తాంబూలము లిచ్చుటకు వచ్చెదరనియు చెప్పారు తలి దండ్రులు. శ్యామప్రసాదుకు మతిపోయింది. తలదిమ్మెక్కింది ఒళ్లంతా మంటలు ప్రారం